# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సరుకు రవాణా నిర్వహించేందుకు రాష్ట్రంలో లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

- ❖ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను ఈరోజు విడుదల చేసింది.

- ❖ దేశ సమైక్యతను చాటి చెబుతూ హర్ ఘర్ తిరంగ పిలుపు మేరకు ప్రతి ఇంటి పైన మువ్వన్నెల జెండా ఎగురవేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు.

- ❖ పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈనెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణం కేంద్రం వెల్లడించింది.

===========================

ఆంధ్రప్రదేశ్ తో పాటు పొరుగు రాష్ట్రాలకు సరుకు రవాణా నిర్వహించేందుకు లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఓడరేవులు, విమానాశ్రయాలు, రహదారులు, అంతర్గత జల రవాణా మార్గాల ద్వారా చేపట్టే సరుకు రవాణాను ఈ కార్పొరేషన్ ద్వారానే నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈరోజు రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, విమానాశ్రయాలు, పోర్టుల అభివృద్ధి, మారిటైం పాలసీలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 ఓడరేవులతో పాటూ మరిన్ని విమానాశ్రయాల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఓడరేవులు, విమానాశ్రయాలకు అనుసంధానించేలా శాటిలైట్ టౌన్ షిప్‌లను అభివృద్ధి చేయాలని సూచించారు. సరుకు రవాణపై ప్రత్యేక దృష్టి సారించాలని, రహదారులు, రైల్, ఎయిర్ కార్గో, ఇన్ ల్యాండ్, మారి టైమ్ కార్గోలకు ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా నిలవాలని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.

===========================

రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై ప్రభుత్వం మార్గదర్శకాలను ఈరోజు విడుదల చేసింది. 'స్త్రీ శక్తి' పేరిట ఈ నెల 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 5 కేటగిరీ బస్సుల్లో ఈ సౌకర్యాన్ని అందించబోతున్నామని ప్రభుత్వం వెల్లడించింది. పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. బాలికలు,

మహిళలు, ట్రాన్స్ జెండర్లు తగిన గుర్తింపు కార్డు చూపించి ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. సప్తగిరి, నాన్ స్టాప్, ఇతర రాష్ట్రాల మధ్య తిరిగే అంతర్ రాష్ట్ర బస్సు సర్వీసుల్లో.. అలాగే ఆల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్, ఏసీ బస్సులలో ఉచిత బస్సు ప్రయాణం వర్తించదు. బస్సుల్లో రద్దీ పెరగనున్న దృష్ట్యా అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. బస్టాండ్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది.

===========================

దేశభక్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పాలనే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్ ఘర్ తిరంగ కార్యక్రమానికి పిలుపునిచ్చారని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా విజయనగరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈరోజు చేపట్టిన తిరంగ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశ సమైక్యతను చాటి చెబుతూ ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రతి ఇంటి పైన మువ్వన్నెల జెండా ఎగురవేయాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ 2047 సంకల్పానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ దేశం కోసం, రాష్ట్రం కోసం పాటుపడాలని, భారతదేశాన్ని అగ్రరాజ్యాల వరుసలో నిలబెట్టాలని మంత్రి విజ్ఞప్తి చేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

===========================

జిల్లాలు, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దులు మార్పులకు సంబంధించి తగిన సూచనలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఈనెల 13న మొదటి సారి సమావేశం కానుందని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఈ రోజు ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ... జిల్లాల పున:వ్యవస్థీకరణలో గత ప్రభుత్వం నియమాలను పాటించలేదని, అలాగే కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు పేర్లు పెట్టడంలోనూ వివాదాలు తలెత్తాయని ఆయన వెల్లడించారు. పేర్ల మార్పుతో పాటూ సరిహద్దులు కూడా మార్చాలంటూ.. ప్రజలు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు చేశారని ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశాలపై అధ్యయనం చేసి పరిష్కార మార్గాలను చూపేందుకు రెవెన్యూ శాఖతో సహా ఆరుగురు మంత్రులతో కూడిన బృందాన్ని (జీవోఎం) ఏర్పాటు చేసిందన్నారు.

విరామం

===========================

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో అధికారులు ప్రజల నుండి వినతులను స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. విశాఖపట్నంలో ఈరోజు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనరు కేతన్ గార్గ్ తో కలసి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ... వివిధ సమస్యల సత్వర పరిష్కారానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.

అదేవిధంగా సమస్యల పరిష్కారంలో ఏ ఒక్క అర్జీదారుడు అసంతృప్తి చెందకూడదని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో ప్రజల నుంచి వినతులను కలెక్టర్ స్వీకరించారు.

===========================

రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సినీ రంగ సమస్యలు, కార్మికుల ఆందోళనలపై పలువురు సినీ నిర్మాతలు రాష్ట్ర సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్ తో ఈరోజు సమావేశమై వినతిపత్రం అందజేశారు. సంబంధిత సమస్యలను ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి చర్చిస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. సినీ పరిశ్రమకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎవరైనా స్టూడియోలు, రీ రికార్డింగ్ థియేటర్లు,

డబ్బింగ్ థియేటర్లు నిర్మించేందుకు ముందుకు వస్తే ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

===========================

విశాఖపట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఈరోజు బ్రేకులు విఫలమవడంతో ఒక బస్సు ప్లాంట్ ఫామ్ పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఒక మహిళ మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం పట్ల రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్య సేవలను అందించాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

===========================

మిషన్ వాత్సల్య పేరిట ఆరు సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలను 2 సంవత్సరాల పాటు పెంచి ఆ తరువాత శాశ్వతంగా దత్తత తీసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ కార్యక్రమంపై అవగాహన పెంచే గోడ పత్రికలను స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ రూపొందించగా, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఈ రోజు వాటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దత్తత తీసుకున్న పిల్లలకు కుటుంబ వాతావరణం కల్పించటం, తల్లిదండ్రుల ప్రేమను పంచటం, పిల్లలలో సమాజం పట్ల సానుకూల దృక్పథాన్ని పెంచటమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఈ దత్తత కార్యక్రమానికి ఏడుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఏర్పాటు చేసి, పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేసేలా నిబంధనలు విధించిందని తెలిపారు.

===========================

వైద్య కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ఈ మేరకు ఈరోజు ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్తగా చేరిన విద్యార్థులతో సత్ప్రవర్తనతో మెలిగే వాతావరణాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో తీసుకురావాలని స్పష్టం చేశారు.

===========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 79,857 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమై... చివరికి 747 పాయింట్ల లాభంతో 80,604 వద్ద ముగిసింది. నిఫ్టీ 221 పాయింట్ల లాభంతో 24,585 వద్ద స్థిరపడింది.

===========================

ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ కి ఆనుకుని ఉన్న తెలంగాణ ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 నుండి 5.8 కిలో మీటర్ల మధ్య విస్తరించి ఎత్తుకు వెళ్ళేకొలది దక్షిణం వైపు వంగి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీంతో పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో ఈనెల 13 నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారిణి జి.లక్ష్మి పేర్కొన్నారు. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకూ వాతావరణ సమాచారాన్ని ఆమె వెల్లడిస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

===========================
===========================